# మేట్నీ షో

★ శ్రీమతి వి. ప్రభావతీదేవి

"ఒరే కిష్టిగా ! మధ్యాహ్నం ఫస్ట్ అవర్ మనకి ఖాళీ యేరా—శాస్త్రిగారు సెలవుపెట్టారట. మేట్నీకి కొట్టేద్దామా మనిద్దరం? "—అన్నాడు కాస్త సందు దొరికితే కాలేజీ ఎగ్గొట్టాలని చూసే నారాయణం — కాంటిన్‌లో కూర్చుని కాఫీ తాగుతూ.

"ఉండరాబాబు ! ఫస్ట్ అవర్‌ఖాళీ అయితే సరా ? —సెకండ్‌అవర్ మన పిడతగారిది. ఆయన చాలు మన ప్రాణం తియ్యటానికి. ఇవాళ ఛందస్సు అంతా బట్టీ పట్టుకు రమ్మన్నాడు. —ఉత్పలమాల, మణిమాల. మేఘమాల, రత్నమాల, మట్టీ మశానం— నాకు ఒక్కటీ వచ్చి ఏడవలేదు ఇవన్నీ సరిగ్గా చెప్పకపోతే మన పిలకలు ఝూడించేస్తాడు ఆయన. ఇంతబతుకూ బతికి ఇవాళ ఆడపిల్లల ముందర ఆయన చేత అవమానం పొందాలో ఏమిటో !"

"ఓరి పూలా ! అదేమిటిరా ? అంత వరకూ వస్తే ఆయన పిలక మనమే ఝూడిద్దాం. అయినా మనవి పిలకలు కావుగా- క్రాఫింగులు. ఆ సంగతి మరచిపోయావా? అది సరేగానీ ఇవాళ మధ్యాహ్నం సెకండ్‌అవర్ తెలుగు క్లాసు ఉందనే సంగతే మరచిపోయానురా నేను."

"అయితే ఇంకేం?- చాలా ఘనుడవే అన్నమాట."

"అయితే ఇహ మన దామోదరం ఇవాళ ఫస్ట్ బెంచ్‌లో చేరతాడురోయ్- పోజు లియ్యటానికి"

"మరేమిటనుకున్నావ్?- ఇవాళ మాలతి మహాట్రిమ్‌గా డ్రెసప్ అయివచ్చింది. ఇంకా గమనించలా నువ్వు?"

గమనించకేంరా? అలా ఉంటుందా! - మళ్ళీ చదువులో ఏమి అశ్రద్ధగా ఉండదురా- అస్తమానం సంగీతకచేరీలకి సభలకి. సినిమాలకి తిరుగుతూనే ఉంటుంది- మళి ఎప్పుడు చదువుతుందో ఏమిటో !- మొన్న తెలుగులో ఆవిడగారికి ఫస్ట్‌మార్కు వచ్చిందని మన దామోదరం మొహం ముడుచుకున్నాడు. జ్ఞాపకంలేదూ?"

"అదంతాపైకి- మన ముందర నటనరా. మాలతి అంటే వాడికి వల్లమాలిన అభిమానం. ఆవిడగార్ని—చాటునైనా సరే ఎవరైనా ఒక్క-మాట అంటే వాడు ఊరుకోడు. మీదబడి కరుస్తాడు. ఆవిడ మీద సర్వహక్కులూ తనకే ఉన్నట్టు మాట్లాడతాడు."

"అందులో ఆశ్చర్య మేముందిరా ? అది ఓపెన్ సీక్రెట్ .. మొన్న ఒకసారి వాళ్ళింటికి వెళ్ళి నప్పుడు లెక్చరర్ శాస్త్రి నాతో అన్నాడు- దామోదరం మాలతిని మోనాపలైజ్ చేస్తాడేమిటోయ్?- అని"

"ఏం? ఆయనకి కూడా దిగులుగా ఉందా?"

"అదేమిటిరోయ్ !- 'ఆయనకికూడా' అంటున్నావే- నీకు మొదటినుంచీ దిగులుగానే ఉందా? "

"ఇంకా మెల్లిగా అంటావేమిటిరా?—మాలతిని గురించి ఎవరికి దిగులుగా ఉండదూ? — కాకపోతే పైకెవరూ అనరుగానీ—"

"ఆ మాటే దామోదరం ఎదురుగుండా అను — నీ అంతు తేలుస్తాడు."

"అవును. వాణ్ణిచూస్తే ప్రిన్సిపాల్‌కే హడల్. ఇహ మన మనగా ఎంత ! "

"కాని ఆయన ఎదురుగుండా మనవాడు కొంచెం జంకుతాడురోయ్ !.... మొన్న ఒకసారి మాలతి ఒక్కతే జట్కాలో వస్తోంది. వెనకాల మనవాడు సైకిల్ మీద వస్తూ—అంత దూరంలో ప్రిన్సిపాల్ రిక్షా చూసి రివ్వున ముందుకి వెళ్ళిపోయాడు."

"అదంతా భయం కాదురా నాన్నా !— డిప్లొమసీ ! డిప్లొమసీ !- ఒకవేళ ఈ లవ్ ఎఫెయిర్ విని ఇంట్లో వాళ్ళు ఒప్పుకోకపోతే ప్రిన్సిపాల్ అయినా మద్దతు ఇస్తాడని అప్పుడప్పుడూ ఆయనకి లొంగి ఉన్నట్టు నటిస్తాడు. మనవాడు అన్నివిషయాల్లోనూ అఖండుడురా ! అన్నీ ఇప్పటినుంచే ఆలోచించి అట్టే పెడుతున్నాడు - ఆనక బాధ పడితే లాభంలేదని."

"అసలు ఇంతకీ మాలతి వీణ్ణి చేసుకుంటుందంటావా? మాలతి నాన్న చాలా ఆర్థడాక్స్‌ట- ఈ పొగరుమోతు వాడికి ఆయన తన కూతుర్ని ఇస్తాడా!"

"ఎందుకు చేసుకోదురా నిక్షేపంలా చేసుకుంటుంది- ఒకవేళ ఆ అమ్మాయి వాళ్ళవాళ్ళకి భయపడినా మనవాడు ఊరుకోడు- ఆ అమ్మాయిని ఎత్తుకు పోయైనా పెళ్ళి చేసుకుంటాడు. వాడు మాలతిని ఇంకొకరికి దక్కనివ్వడు."

" ఏమిటిరోయ్ ! వాళ్ళిద్దరి తరపునా వకాల్తా పుచ్చుకున్నట్టు మాట్లాడుతున్నావే."

"అదికాదురా- వాళ్ళిద్దరూ అంతగాఢంగా ప్రేమించుకుని పెళ్ళి చేసుకుందామను కుంటూంటే మధ్యమనకెందుకీబాధ?- అంచేత ఒప్పేసుకుందాం అన్నాను అంతే."

"ఇప్పుడు ఒప్పుకోక ఎవరేమన్నారోయ్? మాలతి నాన్న ఈ పెళ్ళికి ఒప్పుకుంటాడో ఒప్పుకోడో అన్నాను గానీ"

"ఆయన ఒప్పుకోకపోతే మనమంతా కలిసి ఒప్పించాలిరా. అప్పటికీ కుదరక పోతే మనమే పెళ్ళి పెద్దలమయిపోదాం.... ఎలాగైనా ఈ సెలవుల్లో మన దామోదరం ఆ కాస్తా అయిందనిపించేస్తాడులే- లేక పోతే వాడికి పిచ్చెక్కుతుందేమో- కూడా మొన్న ఫిజిక్స్ లాబ్ లో ఏంచేశాడో తెలుసా?"

"ఏంచేశాడేమిటి? కొంపతీసి.... "

"అబ్బెబ్బే. అలాంటిదేం కాదులే.... మాలతి విషయంలో ఫిజిక్స్ లెక్చరర్" "యూసీ!" గారికీ మన దామోదరానికీ పెద్దఘర్షణ జరిగింది. మాలతి దామోదరం వంక చూస్తూ ఇవతల ఎక్స్‌పెర్‌మెంట్ అంతా తగలేసింది. అదంతా లెక్చరర్ గమనిస్తూనే ఉన్నాడు. ఆయనకి ఒళ్ళు మండి పోతోంది. .... ఇంతలో స్టాండుకి సరిగ్గా బిగించలేదు కాబోలు మాలతి చేతిలోంచి బ్యూరెట్ జారి పడి పోయి బ్యూరెట్టూ బీకరూకూడా పగిలి పోయాయి. చప్పునవెళ్ళి మన "యూసీ " గారు అవి పగలగొట్టినట్టు రిజిస్టర్‌లో సంతకం పెట్టమన్నాడు మాలతిని. మాలతి బిక్కమొహం వేసింది .... దామోదరం ఆయన దగ్గరకి వెళ్ళి 'వెంటనే డబ్బు కట్టేసేట్టయితే సంతక మెందుకు సార్?' అన్నాడు ధీమాగా. డబ్బు కట్టినాసరే రిజిస్టర్‌లో ఆవిడ సంతకం ఉండితీరాలంటాడు లెక్చరర్. అవసరం లేదంటాడు దామోదరం. సిల్లీథింగ్. అనవసరంగాఘర్షణ పెరిగింది. సమయానికి ఆ అమ్మాయి దగ్గర డబ్బుకూడా లేకపోయింది. ఆ సంగతి తెలిసి వెంటనే దామోదరం తన జేబులోంచి రూపాయనోట్లుతీసి ఆయన బల్లమీద విసిరేశాడు. మాలతి సంతకమూ పెట్టింది- ఇంత చిన్న విషయానికి మనవాడు ఎంత దూకుడుగా ఆయన మీదికి వెళ్ళాడో తెలుసా?- ఎవరైనా మాలతిని పల్లెత్తు మాట అంటే వాడి రక్తం ఉడికిపోతుంది. కోపంపట్టలేక తన్ను తాను మరిచిపోయి పిచ్చివాడిలా వ్యవహరిస్తాడు."

"ఇశ్ ! ఊరుకోరా కిష్టిగా. దామోదరం వస్తున్నాడు. మన సంభాషణంతా వాణ్ణిగురించే అనితెలిస్తే ఇంకేమన్నా ఉందా వీపు చిట్లగొట్టేస్తాడు .... అయినా సినిమా సంగతి వాణ్ణికూడా కదిపిచూడరా ఏమంటాడో"

"ఏం దామోదరం! మధ్యాహ్నం ఫస్టుఅవర్ ఖాళీయేగా. సెకండవర్ తెలుగుక్లాసు— కాలేజీ ఎగ్గొట్టేసి మేట్నీకి పోదామంటున్నాడు నారాయణం. నువ్వుకూడా రాకూడనూ?" అన్నాడు కృష్ణమూర్తి.

"లేదు కృష్ణా—నాకూ ఈపూట కాలేజీ ఎగ్గొట్టెయ్యాలనే ఉందిగానీ సినిమాకు మాత్రం రాను— నాకు వేరే పనుంది వెళ్ళాలి.... మీరుకూడా ఇవాళ్టికి సినిమా ప్రయాణం మానెయ్యండి. క్లాసుకి వెళ్ళండి. అందరం ఒక్కసారే గైర్‌హాజర్ అయితే బాగుండదు— మన మందరం కలిసి రేపువెడదాం సినిమాకి. ఇవాళనాకువేరే పనుంది."

"నువ్వా అలా అంటే ఎలాగోయ్ దామోదరం — పోనీ క్లాసుకి అటెండ్ అవుదామూ అంటే నాకు ఛందస్సు ఏమీరాలేదు. ఆ పిడతగారు ఏమంటాడో అని భయంగా ఉంది. ఇహ మన నారాయణం సరేసరి- తెలుగు క్లాసు ఉందనే సంగతే మరచి పోయాట్ట."

"ఇంకనేం ? బాగానేఉందీ !- అతనికంటె ఘనుడు-"

"అదికాదు దామోదరం. నువ్వుకూడావస్తే సరదాగా అందరం కలిసి మేట్నీకిపోదాం. రేపు తెలుగు లెక్చరర్ ఏమన్నాఅంటే మాఅందరి తరఫునా ఆయన్ని నువ్వు దబాయించేద్దువుగాని. ఆయన నిన్నేమీ అనడులే. పైగా నువ్వంటే భయపడతాడు కూడాను."

"వాటన్నిటికీ నాకేం అభ్యంతరంలేదుకాని ఇవాళ్టికి మాత్రం నామాటవిని మీరు సినిమా ప్రయాణం మానెయ్యండి— నాకు వేరే పనుంది. నేనువెడుతున్నాను."

"మనకి తెలియకుండా అంత కొంపలుమునిగిపోయే పని ఏమి వొచ్చిందో వీడికి కిష్టిగా?— అదే తనకి అవసరమయితే మళ్ళీ మనందర్నీ బాగా ఉపయోగించుకుంటాడు. మనకి అవసరమయితే ఇలా మొహం తప్పించేస్తాడు. ఏమయినాసరే ఇవాళ మనం సినిమాకి వెళ్ళితీరాలిరా కిష్టిగా — తెలుగుక్లాసు పోయినాసరే దామోదరం రాకపోయినాసరే — నువ్వూ నేను. రాముం మధూ అందరం కలిసేపోదాం — బతిమాలిన కొద్దీ మరీ బెసిరిస్తున్నాడీ దామోదరం."

"ఊరుకోరా నారాయణం - దామోదరాన్ని గురించి అంత చులకనగా మాట్లాడకు. నిజంగానే వాడికేదో అర్జంటుపని తగిలిఉంటుంది. లేకపోతే అలా అనడురా పాపం- పోనీ ఇవాళ్టికి మనమే వెడదాంలే. నువ్వు అంత ఇదిగా అడుగుతూంటే వద్దనటానికి నాకూ మనస్కొప్పటంలేదు.... రామాన్నీ మధుమూర్తినీ తీసుకుని నేను మీ యింటికి వస్తాను — నువ్వు రెడీగాఉండు. అందరం కలిసివెడదాం."

♦ ♦ ♦

"ఏమిటి మాలతీ అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్? ఎనీ సీరియస్ ప్రాబ్లెమ్ ?"

"ఏంలేదు సావిత్రీ. మధ్యాహ్నం నాకు కొంచెం పనుంది. ఇంటికి వెళ్ళాలి. ఫస్టుఅవర్ శాస్త్రిగారు రాలేదు కనుక ఫరవాలేదు. సెకండ్ అవర్ తెలుగుక్లాసు. లెక్చరర్ పర్మిషన్ ఇవ్వరేమో అని భయంగా ఉంది."

"అయితే వెళ్ళు మాలతీ. ఆయనకి మేంచెప్తాంలే. దానికి అంత ఆలోచనెందుకు ?"

"అదికాదు సావిత్రీ.... తెలుగుక్లాసు మానెయ్యటం నాకూ ఇష్టంలేదు — అదీకాక పొద్దున నేను కాలేజీకి రావటం ఆ లెక్చరర్ చూశారుకూడాను. ఈపూట నేను అటెండ్ కాకపోతే ఆయన క్లాసే మానేశానని కోపం తెచ్చుకోరూ ?"

"ఓయబ్బ ! ఎందుకమ్మా అంత భయం ?.... మీ దామోదరం ఎన్నిసార్లు ఆయన క్లాసు ఎగ్గొట్టెయ్యలేదూ?- ఆయన అతన్ని ఎప్పుడైనా కోప్పడ్డారా ?"

"ఛీ ! ఊరుకోవోయ్ నువ్వుమరీను — మా దామోదరమేమిటి ?— మాటిమాటికీ నాదగ్గర అతని పేరెత్తకు."

"ఆహా ! ఏంనంగనాచివి మాలతీ !- నువ్వు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా అతను నీ దామోదరమే. కాదనగలవా ?— నీకోసం దిగులుపడి అతను రోజురోజుకీ ఎలా చిక్కి శల్యమైపోతున్నాడో చూడూ."

"అబ్బ ! ఊరుకో సావిత్రీ ! ఇప్పుడు ఆగొడవెందుకూ."

"పోనీ లేవోయ్ — నీకు అంత ఇష్టంలేకపోతే మాట్లాడను — ఇవాళదాగినా రేపు దాగదుగా.... సరేగానీ ఈపూట క్లాసునిగురించి నువ్వేమీ దిగులుపడకు. నీ తరపున లెక్చరర్‌కి నేను సంజాయిషీ చెప్పుకుంటానులే. నువ్వు నిశ్చయంగా ఇంటికి వెళ్ళొచ్చు. సరేనా ?"

"మెనీ థాంక్సు సావిత్రీ. వెళ్ళొస్తాను."

♦ ♦ ♦

"మాలతీ !"

"ఓ ! ఇక్కడా ఉన్నారు ?.... టైమయిపోతుందేమోనని ఎంత భయపడ్డానో తెలుసా ?... ఎంత సేపయింది మీరువచ్చి ?"

"అదుగో ఆ 'మీరు' అనటమే మానెయ్యాలి మాలతీ!- ఇలాంటప్పుడైనా మనం ఒకరినొకరం మన్నించుకోటం మానెయ్యాలి.... అదిసరేగానీ దేవిగారు ఇంత ఆలస్యంగా వేంచేశారేం ?"

"ఏం చెయ్యను దామోదరం !— కాలేజీలో సావిత్రినీ ఇంటిదగ్గర నాన్ననీ తప్పించుకువచ్చేసరికి ఆలస్యమయింది.... అయినా నాతప్పేమీలేదు. అంతా నీలోనే ఉంది. నేనేం చెయ్యను ?"

"అను మాలతీ అను. ఇంకెన్నాళ్ళు అంటావులే - ఇంక ఇలా నన్ను మాటలతో బాధపెట్టేఛాన్సు నీకివ్వను లేవోయ్. వన్ ఫైన్ మార్నింగ్ వచ్చేసి 'మీ అమ్మాయిని నాకిచ్చెయ్యం'డని మీ నాన్నగార్ని అడుగుతాను. సరేనా ?... ఇవాళ నీకోసం ఆగుంపు అంతటినీ మోసం చేసి తప్పించుకువచ్చాను - మిగతావాళ్ళని గురించి దిగులులేదుగాని కృష్ణమూర్తి ఏమన్నా అనుకుంటాడేమోనని భయంగాఉంది. అతను సినిమాకి రమ్మంటే రానన్నాను."

"పోనీ - అంతబాధగా ఉంటే అతనితోనే సినిమాకి వెళ్ళకపోయావా ? దామోదరం ? మధ్య నన్ను ఎందుకిలా ఇన్‌సల్ట్ చేస్తావ్ ?"

"ఓస్ ! ఇంతలోనే అంత కోపమెందుకండీ రాణీ గారూ ?.... ఊరికే అన్నానోయ్ - నీకోపం ఎలా ఉంటుందో చూద్దామనీ ...ఆట మొదలుపెట్టేస్తారేమో — ఇహ లోపలికి వెడదామా ?"

"టిక్కెట్స్ కొనేశావేమిటి ?"

"మధ్యాహ్నమే సీట్స్ రిజర్వ్ చేయించాను."

"ఆల్‌రైట్. అయితే పద."

◆ ◆ ◆

"ఒరేయ్ కిష్టిగా ! ఆ బాల్కనీసీట్‌లో కూర్చున్న జంటని చూడరా.... అదేమిటిరా ఆసూట్‌వాలా మన దామోదరంలా ఉన్నాడే.''

"ఇశ్ ! నోరుమూసుకు కూర్చోరా నారాయణం. చూస్తూ ఉన్నవాళ్ళు తిడతారనైనా భయంలేదేం ?- ఇక్కడికి వచ్చికూడా ఆవెధవవాగుడేనా ? ఇప్పుడు నీ కోసం దామోదరం ఎక్కడనించి ఊడిపడ్డాడూ ? వాడు- 'నాకేదో అర్జంటుపని తగిలింది సినిమాకిరాను మొర్రో'- అని అప్పుడే వెళ్ళిపోతేను ...అయినా నీకు ఎంతసేపూ దామోదరాన్నిగురించీ మాలతినిగురించీ ఆలోచించటమే పని. మరోధ్యాసలేదు. అస్తమానం వాళ్ళ మూవ్ మెంట్స్ అన్నీ గమనిస్తూ ఉండడమే నీఉద్యోగం. నీ అంత అపనమ్మకం మనిషి ఈ ప్రపంచంలోలేడురా."

"అది కాదురా కిష్టిగా ! నువ్వు సరిగ్గా చూడకుండానే నన్ను తిడతావు....కొంచెంసేపట్లో ఆ ఒక్క లైటూ కూడా ఆర్పేస్తే నువ్వు అసలే నామాట నమ్మవ్. పోనీ ఒక్కసారి వెనక్కి తిరిగిచూడు--అంతదూరంనించికూడా వాడి పక్కనున్న ఆ అమ్మాయి, ఆ అమ్మాయి ఒంటిమీద ఆ చీరా ఎలా ధగధగా మెరిసిపోతున్నాయో !....ఇహ ఆ అమ్మాయి మాలతికాదనీ ఆ సూట్‌వాలా దామోదరం కాదనీ దబాయించేస్తే కళ్ళున్నవాళ్ళెవరయినా నమ్ముతారా ?— వాళ్ళు అక్కడనించి మనని చూసేవుంటారు. చూడనట్టు నటిస్తున్నారు. నీకు కనబడకపోతే నాకళ్ళు ఎరువుపుచ్చుకుని చూడు....అందుకే వాడు ఇందాక మనని సినిమా ప్రయాణం మానెయ్యమని అంత ఇదిగా ఆర్డర్‌వేశాడు."

"అవునురా నారాయణం ! నువ్వు అంటూంటే ఏమిటో అనుకున్నాను -మొత్తానికి దామోదరం మనని మోసం చేసేశాడురా!''

"వాడేమీ మోసం చెయ్యలేదురా - ఇటువంటి విషయాల్లో వాడు ఒఠి అమాయకుడు. ఇదంతా ఆ మాలతిగారి ప్రభావర !- ఆవిడగారు మనతో చెప్పొద్దని ఆర్డర్ వేసుంటుంది. ఈయనగారు శిరసావహించి ఉంటాడు....నేను ఏనాడో చెప్పాను— ఇహ దామోదరం మనవాడు కాదురానాయనా - అని ఇవాళ మేట్నీషో అయినా నీకు కనువిప్పు కలిగించిందా ?''

"పోనీలేరా నారాయణం - దానికి అంత బాధపడట మెందుకు?— ఏనాటికైనా వాళ్ళిద్దరూ ఒకటిగా ఉండటమే మనం కోరుకోవలసింది. ఇవాళ మేట్నీషోకి వాళ్ళిద్దరూ కలిసిరావటం నిజంగా చూడవలసిన దృశ్యం. అందుకు నేను నిజంగా చాలా సంతోషిస్తున్నాను. వాళ్ళిద్దరికీ పెళ్ళి అయితే సంతోషించేవాళ్ళల్లో నేను మొదటివాణ్ణి....నువ్వు కూడా నిండుహృదయంతో వాళ్ళని ఆశీర్వదించు నారాయణం !"

